వంతెన శిథిలం.. ప్రయాణం భయం భయం





కూలేందుకు సిద్ధంగా ఉన్న వంతెన

రెయిలింగ్ లేక ప్రమాదకరంగా మారిన సిద్ధాంతం-మల్లాయపాలెం రోడ్డులోని వంతెన

గుడివాడరూరల్: లేళ్లపూడి చానల్‌పై వేల్పూరు సిద్ధాంతం సమీపంలో దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. వంతెన రెయిలింగ్ శిథిలమై వంతెన బీటలు వారి కూలేందుకు సిద్ధంగా ఉంది. దీంతో ఈ వంతెనపై ప్రయాణించే వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. వేల్పూరు సిద్ధాంతం, గుడ్లవల్లేరు మండలంలోని పలు గ్రామాల నుంచి ముదినేపల్లి మండలం, చౌటపల్లి, మల్లాయపాలెం తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు దశాబ్దాల క్రితం లేళ్లపూడి చానల్‌పై వంతెన నిర్మించారు. వంతెన నిర్మించకముందు పరిసర ప్రాంతాల ప్రజలు కాల్వను దాటేందుకు పడవలు ద్వారా ప్రయాణించాల్సిన పరిస్థితి ఉండేది. వాహనాలు వెళ్లాలంటే గుడివాడ వెళ్లి మల్లాయపాలెం తదితర ప్రాంతాల నుంచి ఎక్కువ దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి ఉండేది. సమస్యను గుర్తించిన అప్పటి పాలకులు చానల్‌పై వంతెనను నిర్మించారు. వంతెన పర్యవేక్షణ అధికారులు గాలికి వదిలేయడంతో ప్రస్తుతం వంతెన పరిస్థితి దయనీయంగా మారింది. దీంతో భారీ వాహనాలు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. ద్విచక్ర వాహనదారులు, కార్లు వెళ్లాలన్నా భయపడాల్సిన పరిస్థితి దాపురించింది.

ఆదమరిస్తే అంతే..

లేళ్లపూడి చానల్‌పై వంతెనపై ఎవరైనా ఆదమరచి ప్రయాణిస్తే అంతే సంగతులు. కాల్వలోకి వాహనాలు పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో వంతెనపై ప్రయాణం అంటే వాహనదారులు, పరిసర ప్రాంత ప్రజలు హడలెత్తిపోతున్నారు. వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిందని వంతెన మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. వంతెన కూలితే సిద్ధాంతం తదితర గ్రామాల ప్రజలకు ముదినేపల్లి మండలంతో పాటు ఇతర ప్రాంతాలకు సత్‌సంబంధాలు తెగిపోయే ప్రమాదం ఉందని ప్రజలు, వాహనచోదకులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి శిథిలావస్థలో చేరిన వంతెన స్థానంలో మరో వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

వంతెనపై ప్రయాణమంటేనే హడల్



దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన శిథిలమైంది. వంతెనకు ఇరువైపులా రెయిలింగ్ లేకపోవడంతో రక్షణ కరువైంది. వంతెనపై వాహనాలతో ప్రయాణించడానికి భయపడుతున్నాం. చాలా మంది వంతెనపై ప్రయాణించి ప్రమాదాలకు గురయ్యారు. వంతెనను పునర్నిర్మించాలి.

– ఎ.పండు, వాహనదారుడు

అధికారులు పట్టించుకోవడం లేదు



చుట్టు పక్కల గ్రామాల్లో వ్యవసాయం ఎక్కువగా ఉండటంతో నిత్యం వాహనాలపై వంతెనపై నుంచే ముదినేపల్లి, గుడివాడ ప్రాంతాలకు వెళ్తుంటాం. వంతెన పరిస్థితి దారుణంగా మారింది. ట్రాక్టర్లు సైతం వెళ్లడానికి వీల్లేని విధంగా ఉంది. కనీస మరమ్మతులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదు. వంతెన నిర్మాణంపై ఉన్నతాధికారులు దృష్టిపెట్టాలి.

– విఘ్నేష్, వాహనదారుడు

క్లుప్తంగా

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

గుడ్లవల్లేరు: సైబర్ నేరాల నియంత్రణపై గుడ్లవల్లేరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం ఎస్‌ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. సైబర్ సెక్యూరిటీ నేరాల తీరును వివరిస్తూ వీడియోలు స్క్రీన్‌పై విద్యార్థులకు చూపించారు. అలాగే మహిళల భద్రత, రహదారి భద్రత నియమాలను వివరించారు.

గాయపడిన కార్మికుడికి ఆర్థిక సాయం



గుడివాడ టౌన్ : స్థానిక ఆటోనగర్‌లో పెయింటర్‌గా పనిచేయుచున్న అబ్బాస్‌కు ప్రమాదవశాత్తు గాయాలు కావడంతో కుటుంబ పోషణ నిమిత్తం కొంత ఆర్థిక సాయం అందజేసినట్లు గుడివాడ ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు అబ్దుల్ హమీద్ తెలిపారు. మంగళవారం స్థానిక జాంపేటలోని ఆయన నివాసంలో రూ.10 వేలు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కుద్దూస్, కోశాధికారి ఎ.విజయకుమార్, టి.లక్ష్మణరావు, బి. ఆంజనేయులు, కాజా, మొహిద్దీన్, రెహమాన్, కె.నాగరాజు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



గుడివాడ టౌన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి కృష్ణా జిల్లాలో జరిగిన బాస్కెట్‌బాల్ పోటీల్లో తమ విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కేకేఆర్ గౌతమ్స్ హైస్కూల్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఈ నెల 6వ తేదీన నూజివీడు బీఐఎస్ స్కూల్లో జరిగిన అండర్-14 పోటీల విభాగంలో తమ విద్యార్థిని ఎ. జనవిక రక్ష రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థినిని, కోచ్ మడకా సత్యాన్వేష్‌ను పాఠశాల ప్రిన్సిపాల్స్ ఎం. సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి అభినందించారు.

ఉచిత శిక్షణ తరగతులు

గుడివాడ టౌన్ : స్థానిక కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల్లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మంజులాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్రంట్ ఆఫీస్ అసిస్టెంట్ కోర్సుకు రెండు నెలల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.సురేష్‌కుమార్ పర్యవేక్షణలో ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. కనీస విద్యార్హత 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. పూర్తి వివరాలకు 98488 19682, 96666 54641లో సంప్రదించాలని కోరారు.

హైస్కూల్ విద్యార్థులకు బహుమతులు

గుడ్లవల్లేరు: జిల్లా స్థాయి తెలుగు క్విజ్ పోటీల్లో గుడ్లవల్లేరు ఏఏఎస్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ హైస్కూల్ విద్యార్థులు బహుమతులు సాధించారు. ఈ విషయాన్ని ఆ హైస్కూల్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి మంగళవారం తెలిపారు. విద్యార్థి వికాస వాహిని నిర్వహణలో భాగంగా మచిలీపట్నం హిందూ కళాశాల మహతి లలిత కళ వేదికగా 'కథ చెప్పడం ఎలా, తెలుగు క్విజ్ పోటీల్లో' తమ విద్యార్థులు పోటీ పడ్డారన్నారు. విజేతలకు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ప్రపంచ రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు తదితరులు బహుమతులను అందించారని పేర్కొన్నారు.

ఫైనాన్స్ కంపెనీ రికవరీ ఏజెంట్ అదృశ్యం

కోనేరుసెంటర్: మచిలీపట్నంలోని ఓ ఫైనాన్స్ కంపెనీలో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్న వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటనపై అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిలకలపూడి పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుకర్లాబాదుకు చెందిన చేదేపూడి నాగేశ్వరరావు నగరంలోని శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీలో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాగేశ్వరరావు ఇంటి అవసరాల నిమిత్తం కొంత నగదు అప్పు చేశాడు. ఈ నెల 4న ఇంటి నుంచి బయటికి వెళ్లిన నాగేశ్వరరావు భార్య సీతామహాలక్ష్మికి ఫోన్ చేసి అప్పులు ఉన్నట్లు చెప్పాడు. దీంతో భార్య అప్పులు ఎందుకు చేశావని మందలించగా స్వల్ప వాగ్వాదం జరిగింది. దీంతో నాగేశ్వరరావు ఆ రోజు సాయంత్రం పిల్లలను స్కూలు నుంచి తీసుకొచ్చి ఇంటి వద్ద దింపి మళ్లీ బయటికి వెళ్లాడు. ఇంటికి తిరిగి రాలేదు. దీంతో సీతామహాలక్ష్మి తన భర్త కనిపించటంలేదంటూ చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు: సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం పల్లెవాడ ఫీడర్‌కు సంబంధించి బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గుడివాడ విద్యుత్ శాఖ ఈఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పల్లెవాడ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

శ్యామలాంబ ఆలయంలో వేదసభ



కైకలూరు: దసరా ఉత్సవాలు ముగింపు సందర్భంగా కైకలూరు శ్యామలాంబ ఆలయంలో వేద సభ ఆద్యంతం ఆకట్టుకుంది. రాష్ట్రం నలుమూలల నుంచి ఘణాపాఠి, క్రమాపాఠి, వేదపండితులు ఇలా 150 మంది మంగళవారం వేద సభకు విచ్చేశారు. తమ పాండిత్య ప్రతిభను ప్రదర్శించారు. గుళ్లపల్లి దత్తాత్రేయ ఘనాపాఠి నిర్వహించిన సభలో ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ పండితులను సత్కరించారు.

కనకలింగేశ్వరుడికి వెండి నాగాభరణం సమర్పణ

కైకలూరు: ఆలయాల అభివృద్ధికి ముందుకొస్తున్న దాతలు అభినందనీయులని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. కైకలూరు శ్యామలాంబ అమ్మవారి క్షేత్రంలో కొలువైన కనకలింగేశ్వరస్వామికి భుజబలపట్నానికి చెందిన ముదునూరి కొండరాజు మూడు కేజీల బరువైన రూ.4లక్షల విలువైన వెండి నాగాభరణాన్ని కామినేని చేతుల మీదుగా దేవస్థాన ఈఓ వీఎన్‌కే శేఖర్‌కు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన ఉత్సవ కమిటీ అధ్యక్షుడు జంపన రామలింగరాజు, నేతలు బలే ఏసురాజు, బూరుబోయిన శ్రీనివాసరావు, పూల రాజీ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామికి పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం విశేషాభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

వీరాంజనేయస్వామి ఆలయంలో..

పామర్రు: స్థానిక వీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని వడ మాలలు, నాగ వల్లీల మాలలతో అలంకరించి అర్చకులు అగ్నిహోత్రం దినకర్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ వరప్రసాదరావు పాల్గొన్నారు.

పేదలకు సాయం చేయడం అభినందనీయం

పాములపాడు(పెదపారుపూడి): లవ్ అండ్ కంపాషన్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పేదలకు చేస్తున్న సాయం అభినందనీయమని పెదపారుపూడి ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాములపాడు శివారు దూళ్లవాని ఎస్సీ కాలనీలో క్రీస్తు సంఘం, లవ్ అండ్ కంపాషన్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఎస్‌ఐ మంగళవారం ప్రారంభించారు. సుమారు 100 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. అనంతరం సంస్థ చైర్మన్ దగాని సుజీత్ ప్రేమ్ పేదలకు ఉచితంగా సరుకులను అందజేశారు. కార్యక్రమంలో గుడివాడ రోటరీ క్లబ్ సభ్యులు రెడ్డి చౌదరి, వైద్యులు జాయిస్ మంజూష, సత్యనారయణ, రవి పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



జమిదింటకుర్రు(పెదపారుపూడి): తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటే రక్త హీనత తగ్గుతుందని పెదపారుపూడి సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.శివనాగమణి అన్నారు. మండలంలోని జమిదింటకుర్రు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గ్రామ సర్పంచ్ పుణుకొల్లు శివరామ ప్రసాద్ అధ్యక్షతన పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గంటా కృష్ణవేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

మండవల్లి: మండలంలోని ఉనికిలి శివారులో మంగళవారం జూదం ఆడుతున్నారనే సమాచారం మేరకు ఎస్‌ఐ రామచంద్రరావు సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో తొమ్మిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ. 1,03,510 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు



కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశువర్ధక శాఖ మండల అధికారి డాక్టర్ మౌర్య సత్యేంద్ర, సచివాలయాల ఏహెచ్ శ్రీనివాసరావు, నరేంద్ర, అజయ్, జేవీఓ వెంకటయ్య, వీఎల్ఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



గుడివాడరూరల్: స్థానిక ఏలూరురోడ్డులోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 12 మంది బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పంపిణీ చేశారు. కూటమి నాయకులు కడియాల గణేష్, పంద్రాజు సాంబయ్య, రాధాకృష్ణ, సీతయ్య, మల్లి, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెయ్యేరులో వైఎస్సార్ కాలనీకి చెందిన 'మేము సైతం టీం' సభ్యులు మంగళవారం వృద్ధులకు నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. గుడివాడకు చెందిన గూడపాటి భానుప్రసాద్ టీం సభ్యులతో చర్చించి పేద వృద్ధుల కుటుంబాలకు తన మనవరాలు పాసర్ల విహీర పేర ప్రతి నెలా నిత్యావసర వస్తువులు అందించేందుకు ముందుకు వచ్చారు. స్థానిక అంబేడ్కర్‌కాలనీకి చెందిన గోన మాధవరావు, బిళ్లపాడుకు చెందిన నంద్యా ఈశ్వరీ కుటుంబానికి ప్రతి నెలా నిత్యావసర వస్తువులు అందించేందుకు ముందుకు వచ్చి టీం నిర్వాహకుడు ఫణీంద్ర ఆధ్వర్యంలో వస్తువులు అందజేశారు.

వెలంపేటలో డ్రెయినేజీ అస్తవ్యస్తం

మండవల్లి: స్థానిక వెలమపేటలో డ్రెయినేజీ అస్తవ్యస్తంగా మారింది. డ్రెయిన్ నీరు రోడ్డు పైకి వచ్చేయడంతో పిల్లలు, వృద్ధులు వ్యాధులబారిన పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయంపై అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ప్రహరీ ఇరువైపులా నల్లమట్టి తోలిన కారణంగా, వర్షం కురిస్తే నల్లమటి రోడ్డుమీదకు జారి పడిపోతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఉన్న నల్లమట్టిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

బాలికోన్నత పాఠశాలకు స్వచ్ఛ అవార్డు



గుడ్లవల్లేరు: మండలంలోని అంగలూరు బాలికోన్నత పాఠశాలకు జిల్లా స్థాయి స్వచ్ఛ అవార్డు లభించింది. ఈ విషయాన్ని ఆ హైస్కూల్ హెచ్‌ఎం జి.జగన్మోహనరావు మంగళవారం విలేకరులకు తెలిపారు. మచిలీపట్నంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో తనను జిల్లా ఇన్‌చార్జి మంత్రి సుభాష్, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు సన్మానించి, పురస్కారాన్ని అందించారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను ఎంఈఓ-2 జి.గోపాలరావు అభినందించారు.

ఘనంగా గంగానమ్మ తల్లి వార్షికోత్సవం



మోపర్రు (పెదపారుపూడి): మండలంలోని మోపర్రు గంగానమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలను గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత అయిన సీతారాంరాజు రామారావు, నక్కుబాయి దంపతులు హైదరబాద్ నుంచి వచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ బోయిన శివయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.

జీఎస్టీ అమలుపై అవగాహన

పామర్రు: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీను తగ్గించడంపై జీఎస్టీ చాంపియన్స్ స్వాతి, రాజేశ్వరీలు స్థానిక శ్రీనివాస విద్యా సంస్థల విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస విద్యాసంస్థల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

మొవ్వ: సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మంగళవారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సత్యనారాయణ, అధ్యాపకులు నాగేశ్వరరావు, రంగనాయకులు, వాసు బాబు, ఆనందరావు పాల్గొన్నారు.

కైకలూరు: కేంద్రం ప్రవేశపెట్టిన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పథకాలపై మండలంలోని 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం అవగాహన కల్పించారు. ఏలూరు జిల్లా జీఎస్టీ అధికారి సీహెచ్.కిరణ్‌కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన సమావేశంలో వస్తువులపై కొనుగోలుదారులకు రేటు తగ్గుతుందనే విషయాన్ని వివరించారు. ఆటపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఓరియంటల్ జెడ్పీ ఉన్నత పాఠశాల, నేషనల్, ఆక్స్‌ఫర్డ్ ప్రైవేట్ స్కూల్స్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి డి.రామారావు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ గవాయ్‌పై దాడి దారుణం



నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

గుడివాడ టౌన్ : భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై దాడి అమానుషమని సీపీఎం పట్టణ కమిటీ నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని శ్రీనివాస సెంటర్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు లంకా సురేంద్ర మాట్లాడుతూ లౌకికవాదులందరూ ఐక్యమై పోరాడితే తప్ప దేశానికి మనుగడ ఉండదన్నారు. వామపక్ష నాయకులు శ్రీనివాస్, ఎం. లక్ష్మణరావు, త్రిమూర్తులు, అవిర్నేని వెంకటేశ్వరరావు, పివి. రమణ, లక్ష్మణరావు, మహేశ్వరరావు, చౌటయ్య, అప్పలనాయుడు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఖండన

జస్టిస్ బి.ఆర్. గవాయ్‌పై దాడిని గుడివాడ బార్ అసోసియేషన్ ఖండించింది. మంగళవారం బార్ అసోసియేషన్ హాల్లో న్యాయవాదులు విలేకరులతో మాట్లాడుతూ గవాయ్‌పై జరిగిన దాడిని ప్రజాస్వామ్య విలువలపై జరిగిన దాడిగా గుర్తించాలన్నారు. బార్ అసోసియేషన్ న్యాయవాదులు వీవీకేడీ ప్రసాద్, సీహెచ్ కుటుంబరావు, పి.రవికుమార్, క్రాంతి, సీతారామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

కొండలమ్మ సన్నిధిలో చండీ హోమం



చండీ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో మంగళవారం రుద్ర సహిత చండీ హోమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు రుద్రపాక శరశ్చంద్ర శివ సంతోష్ వేద పండితుల బృందం ఈ హోమాన్ని చేపట్టారు. కృష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య, దేవస్థాన ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు పాల్గొన్నారు.

కొండలమ్మ సేవలో న్యాయ సేవాధికార కార్యదర్శి



రామకృష్ణయ్యను సన్మానించిన ఈఓ కొండలరావు, చైర్మన్ మోహన్

గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని కృష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య మంగళవారం దర్శించుకున్నారు. వారికి దేవస్థాన ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు ఆలయ మర్యాదలతో సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం సన్మానించి అమ్మవారి చిత్ర పటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు.

వరిలో తెగుళ్ల నివారణపై రైతులకు శిక్షణ



రైతులకు సూచనలు ఇస్తున్న డీడీఏ జ్యోతిరమణి

తేలప్రోలు(గన్నవరం): ఉంగుటూరు మండలం తేలప్రోలులోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం జిల్లా వనరుల కేంద్రం(డీఆర్‌సీ) ఆధ్వర్యంలో రైతులకు వరి సాగులో చీడపీడలు, తెగుళ్ల నివారణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌సీ డీడీఏ జ్యోతిరమణి మాట్లాడుతూ ప్రస్తుతం వరి చిరుపొట్ట దశలో ఉన్న దృష్ట్యా రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కాండం తొలుచు పురుగు, మెడ విరుపు తెగులు, పొట్ట కుళ్లు వంటి తెగుళ్లు ఆశించకుండా నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు. భూసార పరీక్షలకు అనుగుణంగానే రైతులు ఎరువులు వినియోగించాలని ఏడీఏ శ్రీనివాసరావు సూచించారు. మండలంలో ఈ నెలఖారు నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి రానున్నట్లు ఎంఏఓ జి.రమేష్ తెలిపారు. ఏఓ పద్మజ, పలువురు గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్తు తల్లిదండ్రుల చేతుల్లోనే



మాట్లాడుతున్న ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.రాణి

చల్లపల్లి: పిల్లల భవిష్యత్తు తల్లిదండ్రుల చేతుల్లోనే ఉందని మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.రాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం 8వ రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథి సీడీ రాణి మాట్లాడుతూ అంగన్‌వాడీల ద్వారా అందించే పౌష్టికాహారం తీసుకోవటం వల్ల బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. చిన్న పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని అన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. తల్లిదండ్రులు ఆరోగ్య సూత్రాలను పాటించటం వల్ల వారి వారి పిల్లలు కూడా ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఐసీడీఎస్ మొవ్వ ప్రాజెక్ట్ సీడీపీఓ ప్రసన్న విశ్వనాథ్, ఎంపీపీ కోట విజయరాధిక, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బోలెం నాగమణి, తహసీల్దార్ డి.వనజాక్షి, ఎంపీడీవో కార్యాలయ ఏఓ అతావుల్లా, సీహెచ్ఓ సుమతి, ఎంఈఓ- 2 పి.వెంకటేశ్వరరావు, సీహెచ్ఓ సుమతి, అడ్వొకేట్ సరస్వతి, సెక్టార్ సూపర్‌వైజర్లు ఆదిలక్ష్మి, విశ్రాంతమ్మ, రమానాగమణి, కళ్యాణి, రత్నమాల, రాజేశ్వరి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

రుణాల మంజూరు జాప్యంపై విచారణ



విచారణ అధికారి నాగవెంకట ప్రసాద్‌కు సమాచారం అందజేస్తున్న ఆర్టీఐ కార్యకర్తలు

ఉయ్యూరు: బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ రుణాల మంజూరు చేయడంలో జాప్యంపై వచ్చిన ఫిర్యాదుపై బీసీ కార్పొరేషన్ కార్యాలయ అధికారి సమ్మిట నాగ వెంకట ప్రసాద్ మంగళవారం ఉయ్యూరులో యుఎఫ్ ఆర్టీఐ కార్యాలయానికి వచ్చి విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారు యుఎఫ్ ఆర్టీఐ రాష్ట్ర కోకన్వీనర్ జంపాన శ్రీనివాసగౌడ్ నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసగౌడ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీసీ కార్పొరేషన్ ద్వారా రూ. 896.09 కోట్లు కేటాయించిందన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాకు రూ. 117.65 కోట్లు కేటాయింపు జరిగిందన్నారు. ఈ రుణాల కోసం లబ్ధిదారులు అర్జీలు పెట్టి ఇంటర్వ్యూలకు కూడా హాజరయ్యారన్నారు. ఒక్కో అర్జీదారుకు రూ. 500 నుంచి రూ. 1,000 వరకూ ఖర్చు అయ్యిందన్నారు. అయితే దరఖాస్తులు పెట్టి తొమ్మిది నెలలు గడుస్తున్నా ఏ ఒక్క లబ్ధిదారుడికీ రుణం మంజూరు కాలేదన్నారు. సీఎం, డెప్యూటీ సీఎం స్పందించి రుణాలు మంజూరు చేయాలన్నారు. విచారణలో కార్యకర్తలు జోగేశ్వరరావు, దుర్గాప్రసాద్, మరీదు సాంబశివరావు, శివపార్వతి పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్న్‌షిప్

గుడ్లవల్లేరు: మండలంలోని కౌతవరం జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు గుడ్లవల్లేరు శ్రీ లక్ష్మీ మెకానిక్ వర్క్స్‌లో ఆ సంస్థ అధినేత సీహెచ్.ఉపేంద్ర ఆటోమోటివ్ ట్రేడ్‌పై ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో భాగంగా పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న శిక్షణ మంగళవారంతో ముగిసింది. జీసీడీఓ ఒకేషనల్ ట్రైనర్ నిమ్మకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ఇంటర్న్‌షిప్‌లో విద్యార్థులు ఆటోమొబైల్ రంగానికి చెందిన ప్రాథమిక సాంకేతిక నైపుణ్యాలను నేర్చుకున్నారని తెలిపారు.